క్లుప్తంగా

విద్యార్థుల ప్రాణాలతో చెలగాటమా?

• ఏపీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు మల్లవరపు అశోక్‌రెడ్డి



ఆత్మకూరు: పార్వతీపురం మన్యం జిల్లా కురుపాం గిరిజన గురుకుల పాఠశాలలో సరైన వసతులు కల్పించకుండా రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల ప్రాణాలతో చెలగాటం ఆడటం ఏమిటని ఆంధ్ర విద్యార్థి సంఘం (ఏపీఎస్) రాష్ట్ర అధ్యక్షుడు మల్లవరపు అశోక్‌రెడ్డి నిలదీశారు. ఈ మేరకు ఆ సంఘ కార్యాలయంలో మంగళవారం మాట్లాడుతూ కురుపాం గురుకుల పాఠశాలలో ఆర్‌ఓ ప్లాంట్ చెడిపోవడంతో కలుషిత నీటినే విద్యార్థినులు తాగుతున్నారన్నారు. దీంతో పలువురు రోగాలపాలయ్యారన్నారు. కలుషిత నీరు తాగి నాలుగు రోజుల వ్యవధిలో పచ్చకామెర్లు, తదితర వ్యాధులతో ముగ్గురు విద్యార్థినులు మృతిచెందడం బాధాకరమన్నారు. వెంటనే ఆ పాఠశాలలలో వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు. బాధ్యులపై చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సంఘ కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

వైభవంగా కుంభాభిషేకాలు



ఆత్మకూరురూరల్: మండలంలోని గండ్లవేడులో నూతనంగా నిర్మించిన పోలేరమ్మ తల్లి ఆలయ ప్రతిష్టా కుంభాభిషేకాలు మంగళవారం అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. కనుమళ్ల సత్యనారాయణ శర్మ, గ్రామ పురోహితుడు కురిచేటి ప్రసాద్‌శర్మ సమక్షంలో ఐదు రోజుల పాటు కుంభాభిషేకాలు జరుగుతాయని ఉభయకర్తలు తెలిపారు. ఈ సందర్భంగా భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత



ఆత్మకూరు: ఆత్మకూరు మున్సిపల్ పరిధిలో వివిధ కారణాలతో ఇటీవల పలువురు మృతిచెందగా వారి కుటుంబాలకు సాంబశివ చారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకుడు కంచి పరమేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో రూ.10 వేల చొప్పున ఆర్థిక సాయం అందజేశారు. ఒకటో వార్డుకు చెందిన మొలబంటి మాలకొండయ్య, రెండో వార్డుకు చెందిన షేక్ అహ్మద్‌బాషా, మూడో వార్డుకు చెందిన కల్లె చక్రప్ప, ఐదో వార్డుకు చెందిన ఖాదర్‌హుస్సేన్, ఏడో వార్డుకు చెందిన సయ్యద్ ఖాసీంబి, తొమ్మిదో వార్డుకు చెందిన పెళ్లూరు విశ్వనాథం, 15వ వార్డుకు చెందిన షేక్ సుల్తాన్ మొహిద్దీన్, 16వ వార్డుకు చెందిన రాగి పెంచలమ్మ, 22వ వార్డుకు చెందిన వి.పెద వెంగయ్య, 23వ వార్డుకు చెందిన తురిమెర్ల ప్రభాకర్‌లు ఇటీవల మృతిచెందగా, బాధిత కుటుంబాలను కంచి పరమేశ్వరరెడ్డి మంగళవారం పరామర్శించి రూ.10 వేలు చొప్పున ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో రామ్‌పల్లి ప్రసాద్‌రెడ్డి, నరసింహారెడ్డి, హరీష్‌కుమార్ పాల్గొన్నారు.

సంగసానిపల్లి ఉపాధ్యాయినికి అవార్డు



సీతారామపురం: ఆలిండియా క్రిస్టియన్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో హైదరాబాద్ రవీంద్ర భారతిలో మంగళవారం నిర్వహించిన అవార్డుల ప్రదానోత్సవంలో మండలంలోని సంగసానిపల్లి ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయిని పవిత్రకుమారికి నేషనల్ బెస్ట్ టీచర్ అవార్డు దక్కింది. ఈ మేరకు ఏఐసీఎఫ్ ఫౌండర్ గడ్డపాటి విజయరాజు, తెలంగాణ స్టేట్ మైనారిటీస్ కమిషన్ వైస్ చైర్మన్ శంకర్ లూకే చేతుల మీదుగా ఆమె అవార్డును అందుకున్నారు.

ఏపీ ఎన్జీజీఓ సభ్యత నమోదు



వింజమూరు(ఉదయగిరి): ఏపీ నాన్ గెజిటెట్, గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ వింజమూరు తాలూక అధ్యక్షుడు వెలుగోటి మధు ఆధ్వర్యంలో నూతన సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని వింజమూరు, కలిగిరి, కొండాపురం మండలాల్లో మంగళవారం చేపట్టారు. నవంబర్‌లో కొత్త పాలక మండలి ఎన్నిక నిమిత్తం సభ్యత నమోదు చేపట్టినట్లు సంఘ నేతలు చెబుతున్నారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాటం చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో నరసయ్య పాల్గొన్నారు.

దాడిపై ఫిర్యాదు

అనుమసముద్రంపేట: తనపై కొందరు దాడి చేశారని గుడిపాడు పంచాయతీ అబ్బాసాహెబ్‌పేటకు చెందిన కప్పల వెంగయ్య మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆయన వివరాల మేరకు.. గ్రామంలో గత కొన్నేళ్లుగా మెట్ట భూమి సాగు చేస్తున్నానని, అయితే ఈ భూమిలో కొన్నిచోట్ల గుంతలు ఏర్పడడం వల్ల వాటికి మట్టి తోలుతున్న క్రమంలో కొందరు వ్యక్తులు దాడి చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు.

రావులకొల్లు చెరువు నుంచి ట్రక్కుకు మట్టిని లోడ్ చేస్తున్న జేసీబీ



అక్రమార్కుల ఇష్టారాజ్యం

మండల పరిధిలో రోడ్డు నిర్మాణాల పేరిట అనుమతులు లేకుండా నిబంధనలకు విరుద్ధంగా అక్రమార్కులు చెరువుల మట్టిని కొల్లగొడుతున్నారు. ఇష్టానుసారంగా మట్టిని తరలిస్తుండడంతో చెరువుల్లో భారీ గుంతలు ఏర్పడుతున్నాయి. దీనిపై చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు కోరుతున్నప్పటికీ అధికార పార్టీ నేతల ఒత్తిళ్లతో అధికారులు చూసిచూడనట్లు వ్యవహరిస్తున్నారు.

• చెరువుల మట్టిని కొల్లగొడుతున్న వైనం
• అనుమతుల్లేకుండా దోపిడీ
• చోద్యం చూస్తున్న ఇరిగేషన్ అధికారులు



రావులకొల్లు చెరువులో మట్టి తరలింపులో ఏర్పడిన భారీ గోతులు

కలిగిరి: కలిగిరి–వలేటివారిపాళేనికి సంబంధించి డబుల్ రోడ్డు నిర్మాణ ప్రస్తుతం పనులు జరుగుతున్నాయి. అందులో భాగంగా లెవలింగ్ కోసం గత కొన్ని రోజులుగా కాంట్రాక్టర్ ఎలాంటి అనుమతులు తీసుకోకుండా రావులకొల్లు చెరువు నుంచి భారీ వాహనాలతో మట్టిని తరలిస్తున్నారు. దీంతో చెరువులో భారీ గోతులు ఏర్పడ్డాయి. చెరువులో భారీ యంత్రాలతో నిత్యం గ్రావెల్ తరలింపు విషయం ఇరిగేషన్ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా కనీసం అటు వైపు చూడటం లేదనే విమర్శలు ఉన్నాయి.

నిబంధనలకు మించి తవ్వకాలు

కావలి–దుత్తలూరు నేషనల్ హైవేకి కూడా కలిగిరి పెద్ద చెరువును భారీగా మట్టిని తరలిస్తున్నారు. సంబంధిత కాంటాక్టర్లు గ్రావెల్ తరలింపునకు అనుమతులు పొందినప్పటికీ నిబంధనల కంటే ఎక్కువ లోతుగా మట్టి తవ్వకాలు జరుపుతున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. టెండర్ల సమయంలో మట్టిని కొనుగోలు చేస్తున్నామని చూపుతూ ఇలా చెరువులు, వాగుల నుంచి అక్రమంగా తరలించిన మట్టి, గ్రావెల్‌తో ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారు. కాంట్రాక్టర్లు ఖర్చులు తగ్గించుకుని లబ్ధి పొందుతున్నారు. మట్టి తవ్వకాలతో చెరువుల్లో భారీగా గుంతలు ఏర్పడి ప్రమాదకరంగా మారుతున్నాయి. ఎక్కడైనా విషయం వెలుగులోకి వచ్చి పోలీసులు, ఇరిగేషన్ అధికారులు చర్యలు తీసుకుంటే అధికార పార్టీ నాయకులతో ఒత్తిళ్లు తీసుకొస్తున్నారు. ఈ నేపథ్యంలో ఇరిగేషన్ అధికారులు నామమాత్రపు జరిమానాలు విధించి చేతులు దులుపుకుంటున్నారనే విమర్శలు వస్తున్నాయి.

లేఅవుట్లకూ చెరువుల మట్టే

మండలంలో ఏర్పాటు చేసిన, చేస్తున్న లేఅవుట్లకు కూడా సమీపంలోని చెరువుల మట్టిని అనుమతులు లేకుండా తరలిస్తున్నారు. కొన్నిచోట్ల లేఅవుట్లు వేయడానికి ముందు రైతుల పేరుతో ఇరిగేషన్ అధికారులకు నామమాత్రం రుసుం చెల్లించి అధిక మొత్తంలో మట్టిని తోలుకుంటున్నారు. భారీ చెరువు మట్టితో అస్థలాన్ని చదును చేస్తున్నారు. అనంతరం నూడా, ఇతర అనుమతులు పొంది లేఅవుట్లు వేస్తున్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు

అనుమతుల్లేకుండా చెరువులు, వాగుల నుంచి మట్టి, గ్రావెల్ తరలిస్తే చర్యలు తీసుకుంటాం. రావులకొల్లు చెరువు నుంచి కలిగిరి–వలేటివారిపాళెం రహదారి నిర్మాణానికి మట్టి తరలింపును నిలిపివేశాం.

– శ్రీనాథ్, ఇరిగేషన్ ఏఈ, కలిగిరి



కలిగిరి పెద్దచెరువు నుంచి అక్రమంగా సాగుతున్న మట్టి తరలింపు

న్యాయమూర్తిపై దాడికి యత్నం అమానుషం

ఆత్మకూరు: సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి బీఆర్ గవాయ్‌పై ఓ లాయర్ దాడికి ప్రయత్నం చేయడం అమానుషమని, దీనిని ప్రతిఒక్కరూ తీవ్రంగా ఖండించాలని ఆత్మకూరు న్యాయవాదులు, పలు ప్రజాసంఘాలు, సీపీఎం, జేవీవీ పార్టీల నాయకులు నిరసన వ్యక్తం చేశారు. ఈ మేరకు మంగళవారం ఆత్మకూరు పట్టణంలో నిరసన ర్యాలీ నిర్వహించి అనంతరం ఆర్డీఓ పావనికి వినతి పత్రం అందజేశారు. తొలుత మున్సిపల్ బస్టాండ్ ఆవరణలోని సీనియర్ సివిల్ జడ్జి, జూనియర్ సివిల్ జడ్జి కోర్టులకు చెందిన లాయర్లు, ప్రజాసంఘాల నాయకులు అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించారు. అనంతరం న్యాయమూర్తిపై దాడిని ఖండిస్తూ ర్యాలీగా ఆర్డీఓ కార్యాలయానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా పలువురు న్యాయవాదులు మాట్లాడుతూ ప్రజాస్వామ్య దేశంలో ఇలాంటి ఘటనలు చోటుచేసుకోవడం బాధాకరమన్నారు. మరోసారి ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా పటిష్ట చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో న్యాయవాదులు కేవీ శేషారెడ్డి, నందా ఓబులేసు, తిరుపతమ్మ, షేక్.నజీర్, మధుసూదన్‌లతో పాటు జేవీవీ, సీపీఎం నాయకులు కేసీ కృష్ణయ్య, సందానీ, సాధిక్ హుస్సేన్, వాగాల శ్రీహరి, కె.డేవిడ్‌రాజు, జి.లక్ష్మీపతి, అన్వర్ తదితరులు పాల్గొన్నారు.



అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న న్యాయవాదులు, ప్రజాసంఘాల నాయకులు

హస్త కళాకారులకు శిక్షణ



మాట్లాడుతున్న సత్యనారాయణమూర్తి

ఉదయగిరి: పట్టణంలోని చెక్క నగిషీ కేంద్రంలో ఐదునెలల పాటు నిర్వహించే నైపుణ్యం శిక్షణను హస్త కళాకారులు సద్వినియోగం చేసుకోవాలని తిరుపతి హస్తకళల అభివృద్ధి కమిషనర్ ఆఫ్ అసిస్టెంట్ డైరెక్టర్ సత్యనారాయణమూర్తి కోరారు. ఈ మేరకు ఆయన శిక్షణా కార్యక్రమాన్ని మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ శిక్షణ నిమిత్తం రూ.14 లక్షల నిధులు మంజూరు చేశారన్నారు. టెక్నికల్, డిజైన్ డెవలప్‌మెంట్, సాఫ్ట్ స్కిల్స్‌పై మాస్టర్ ట్రైనర్స్ శిక్షణ ఇస్తారన్నారు. ఇక్కడ తయారు చేసే చక్కనగిషీ వస్తువులు ప్రపంచ వ్యాప్తంగా విక్రయించేలా చర్యలు తీసుకుంటామన్నారు. హస్తకళల ఎగుమతి ప్రోత్సాహక సంస్థ అధికారి శ్రీనివాసరావు, మాస్టర్ క్రాఫ్ట్స్ పర్సన్ షాహిదా, నిర్వాహకుడు జాకీర్ హుస్సేన్ పాల్గొన్నారు.

మత్తుతో జీవితం చిత్తు

కలిగిరి: మత్తు పదార్థాలకు బానిసలుగా మారితే జీవితాలు చిత్తు అవుతాయని కలిగిరి సీఐ పి.వెంకటనారాయణ తెలిపారు. కలిగిరిలోని ఆర్టీసీ బస్‌స్టేషన్‌లో జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత, విశ్రాంత ఉపాధ్యాయుడు నందనవనం ప్రభాకర్ ఏర్పాటు చేసిన వ్యవసానాలకు దూరంగా ఉండాలి అనే బోర్డును మంగళవారం ఆయన ఆవిష్కరించారు. మత్తు పదార్థాలు, చెడు వ్యసనాలతో కలిగే అనర్థాలను ప్రజలకు వివరించారు.

బట్రకాగోళ్లులో పశువైద్య శిబిరం

అల్లూరు: అల్లూరు మండల పరిధిలోని బట్రకాగోళ్లు గ్రామంలో పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ఉచిత పశువైద్య శిబిరాన్ని మంగళవారం నిర్వహించారు. 78 పశువులకు వైద్యసేవలు అందించి మందులను పంపిణీ చేశారు. 30 దూడలకు నట్టల నివారణ మందులు తాగించారు. ఆ శాఖ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ మల్లారెడ్డి, ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ శ్రీనివాసరావు, అల్లూరు పశువైద్యులు మహేశ్వరయ్య, రహీమ్ పాల్గొన్నారు.

కలిగిరిలో సీఐటీయూ మహాసభ

కలిగిరి: కలిగిరిలో సీఐటీయూ రెండో మహాసభ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కన్వీనర్‌గా మేరీ, కో–కన్వీనర్‌గా గౌసియా, మరో ఏడుగురు సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

వైద్యుల సమ్మెకు సంఘీభావం



కలిగిరి: కలిగిరి పీహెచ్‌సీ వద్ద జరుగుతున్న వైద్యుల సమ్మెకు ఏపీ హంస అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం సంఘీభావం తెలిపారు. ఈ క్రమంలో వైద్య సిబ్బంది నల్లబ్యాడ్జీలు ధరించి విధులకు హాజరయ్యారు. అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కప్పా నారాయణరాజు, వింజమూరు సభ్యులు సాయిలక్ష్మి, తిరుపతిరావు, సిబ్బంది లక్ష్మీప్రసాద్, మేరీ, విజయ, సుమలత, మహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

ఆత్మకూరు: అర్చకులకు ధూప, దీప, నైవేద్యం పథకం ద్వారా లబ్ధి పొందుతున్న వారి పిల్లలకు తల్లికి వందనం పథకం అందడం లేదని ఫిర్యాదు చేశారని, అలాంటి వారు దరఖాస్తు చేసుకోవాలని ఆర్డీఓ కార్యాలయ అధికారులు నుంచి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సాంకేతిక సమస్యలను పరిష్కరించుకునేందుకు మరోసారి దరఖాస్తు చేసుకోవాలని వివరించారు.

నీటి వనరుల గణనపై సమీక్ష

మర్రిపాడు: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో నీటి వనరుల గణనపై మంగళవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ అనిల్‌కుమార్ మాట్లాడుతూ మండలంలో మొత్తం మూడు వేల వరకు చిన్న నీటి వనరులు ఉండగా, అందులో ఇప్పటివరకు 1,100 మాత్రమే గణన చేసి ఉన్నారని, మిగిలిన వాటిని వారంలోపు పూర్తి చేయాలని తెలిపారు. ఏఎస్‌ఓ రామకిశోర్, ఆర్‌ఐ సాయికుమార్, వీఆర్వోలు, వీఆర్‌ఏలు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో ఆరోగ్యం

ఆత్మకూరు: క్రమం తప్పకుండా పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా గర్భిణులు, చిన్నారులు ఆరోగ్యంగా ఉంటారని ఐసీడీఎస్ సీడీపీఓ సునీలత అన్నారు. ఎల్‌ఆర్‌పల్లి–1 అంగన్‌వాడీ కేంద్రంలో పౌష్టికాహార మాసోత్సవ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పౌష్టికాహారాన్ని ప్రదర్శించి, వాటి ఆవశ్యకతను తెలియజేశారు. సూపర్‌వైజర్ కస్తూరి, పులిమి శైలజ, అంగన్‌వాడీ కార్యకర్త షకీలా పాల్గొన్నారు.

కొండాపురంలో వర్షం

కొండాపురం: మండలంలో పలు గ్రామాల్లో మంగళవారం సాయంత్రం ఉరుములు మెరుపులతో కూడిన వర్షం పడింది. దీనివల్ల జామాయిల్ సాగుకు మంచిదని రైతులు అంటున్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం మార్పు

సాక్షి ఎఫెక్ట్..

ఆత్మకూరురూరల్: తూతూ మంత్రంగా ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలు వెలవెలబోతున్న విషయంపై సాక్షిలో సోమవారం ప్రచురితమైన 'ప్రచారానికే కొనుగోలు కేంద్రాలు' కథనానికి అధికార యంత్రాంగం స్పందించింది. ఆత్మకూరు మండలం మహిమలూరులో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మంగళవారం రాష్ట్ర సివిల్ సప్లయ్స్ డైరెక్టర్ వేమిరెడ్డి పట్టాభిరామిరెడ్డి అధికారులతో కలిసి పరిశీలించారు. అక్కడి రైతులు ధాన్యం కొనుగోలు కేంద్రం తమకు అవసరం లేదని చెప్పడంతో దీనిని ఆత్మకూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ కేంద్రానికి మార్పు చేయించారు. ఏఎంసీ వైస్ చైర్మన్ గొట్టిగుండాల బుజ్జిరెడ్డి, ఎంపీపీ కేతా వేణుగోపాల్‌రెడ్డి, ఏఎంసీ మేనేజర్ కృష్ణప్రసాద్ పాల్గొన్నారు.

ఆగి ఉన్న వాహనాలను ఢీకొన్న కారు



సోమశిల: అనంతసాగరం మండల పరిధిలోని లింగంగుంట గ్రామం వద్ద ఆగి ఉన్న వాహనాలను ఓ కారు ఢీకొన్న ఘటన మంగళవారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. ఆత్మకూరుకు చెందిన నల్లిశెట్టి మహేష్ అనే వ్యక్తి అనంతసాగరం వచ్చి తిరిగి వెళ్తున్న సమయంలో మలుపు వద్ద నిద్ర మత్తులో వేగంగా వెళ్లి పక్కన నిలిపి ఉన్న కారు, రెండు బైక్‌లను ఢీకొనడంతో నాలుగు వాహనాలు పూర్తిగా దెబ్బతిన్నాయి. ఈ ఘటనపై కేసు నమోదు చేశామని ఎస్సై సూర్యప్రకాష్‌రెడ్డి తెలిపారు.

జూనియర్ లెక్చరర్ మృతికి పలువురి సంతాపం



అహమ్మద్ మొహిద్దీన్ (ఫైల్)

ఆత్మకూరు: ఆత్మకూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఉర్దూ జూనియర్ లెక్చరర్‌గా పనిచేస్తున్న షేక్.అహమ్మద్ మొహిద్దీన్ (44) నరసారావుపేట–గుంటూరు మార్గంలో రోడ్డు ప్రమాదంలో సోమవారం మృతిచెందారు. దీంతో ఆత్మకూరు జూనియర్ కళాశాలలో అధ్యాపకులు, విద్యార్థులు ఆయన మృతికి మంగళవారం సంతాపం వ్యక్తం చేశారు. తన స్వగ్రామం నుంచి నరసరావుపేట మీదుగా గుంటూరుకు వెళ్తున్న క్రమంలో అహమ్మద్ మొహిద్దీన్ రోడ్డు ప్రమాదానికి గురై అక్కడికక్కడే మృతిచెందారు. ఆయన భార్య ఇటీవల జరిగిన డీఎస్సీ ఫలితాల్లో ఉపాధ్యాయినిగా ఎంపికైంది. దీంతో దసరా సెలవుల కోసం స్వగ్రామానికి వెళ్లి సోమవారం గుంటూరులో పనిచూసుకొని ఆత్మకూరు వస్తున్న క్రమంలో ఆయన రోడ్డు ప్రమాదంలో మృతిచెందినట్లు తోటి లెక్చరర్లు తెలిపారు.

ఉపాధ్యాయుల సొంత నిధులతో..

• దెబ్బతిన్న ర్యాంపు స్థానంలో కొత్తగా నిర్మాణం

ఉదయగిరి: పట్టణంలోని షబ్బీర్ కాలనీ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థుల సౌకర్యార్థం ఉపాధ్యాయులు తమ సొంత నిధులతో ర్యాంపును నిర్మించుకున్నారు. పాఠశాల నిర్మాణ సమయంలో నిర్మించిన ర్యాంపు పూర్తిగా దెబ్బతిని విద్యార్థులు తరగతి గదుల్లోకి వెళ్లేందుకు ఇబ్బందులు పడుతుండేవారు. దీంతో పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులు సందానీబేగం, మున్నా తమ సొంత నిధులు రూ.30 వేలు వెచ్చించి ర్యాంపును నిర్మించారు. అలాగే పాఠశాల ఆవరణలో ఉన్న కంపకర్ర చెట్లను తొలగించి విద్యార్థులు ఆటలాడుకునేందుకు క్రీడాస్థలాన్ని చదును చేశారు. ఎస్‌ఎంసీ కమిటీ సహాయంతో, దాతల సహాయ సహకారాలతో పాఠశాల చుట్టూ ప్రహరీ నిర్మాణాలు చేపట్టేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నామన్నారు.

సమయపాలన తప్పనిసరి



మాట్లాడుతున్న డిప్యూటీ డీఎంహెచ్‌ఓ బ్రిజిత

దుత్తలూరు: దుత్తలూరు ప్రాథమిక ఆరోగ్య సిబ్బంది సమయపాలన పాటించి రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని, నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని కావలి డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ బ్రిజిత అన్నారు. ఆమె దుత్తలూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ మంగళవారం చేశారు. ఈ సందర్భంగా పలు రికార్డులు, రిజిష్టర్లు పరిశీలించారు. ఆశా డే సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో తప్పనిసరిగా ప్రతి శుక్రవారం డ్రైడే నిర్వహించేలా అవగాహన కల్పించాలన్నారు. సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలన్నారు. ఇటీవల వైద్యశాల పనితీరుపై విమర్శలు వస్తున్నాయని, 24 గంటలు వైద్యశాల తప్పనిసరిగా తెరిచి ఉండాలన్నారు. లార్వా సర్వే చేపట్టి దోమల వ్యాప్తిని అరికట్టాలన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి వైద్యాధికారి అఖిల్, సీహెచ్‌ఓ ఓంకారయ్య, హెల్త్ సూపర్‌వైజర్ ఖాజా మొహిద్దీన్, పద్మ, నారాయణ, రాజు, అరాఫత్ అలీ, ఆశా వలంటీర్లు పాల్గొన్నారు.

ఆత్మీయ సభా ఏర్పాట్ల పరిశీలన



ఏర్పాట్లను పరిశీలిస్తున్న మేకపాటి రాజగోపాల్‌రెడ్డి

వరికుంటపాడు: మండలంలోని విరువూరు పంచాయతీ మారుతీనగర్‌లో ఈనెల 10వ తేదీన జరుగనున్న వైఎస్సార్‌సీపీ ఆత్మీయ అభినందన సభ, గ్రామ కమిటీల పరిచయ వేదికకు సంబంధించి ఏర్పాట్లను ఉదయగిరి నియోజకవర్గ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా సభా ప్రాంగణంలో జరుగుతున్న ఏర్పాట్లను పరిశీలించి, కార్యక్రమ విజయవంతానికి పలు సూచనలు చేశారు. ఆయన వెంట పార్టీ మండల కన్వీనర్ తిరుపతినాయుడు, మాజీ ఏఎంసీ చైర్మన్ అలీఅహ్మద్, మురళి, చెంచురెడ్డి, శ్రీకాంత్, ఫకీర్‌రెడ్డి, వెంకటరమణ, జక్కం శ్రీనివాసులు, మల్లికార్జున వెంకటేశ్వర్లు, ప్రభాకర్, భాస్కర్, శివ, నారాయణరాజు, తిరుపతిరెడ్డి, మధు, అనంతయ్య, సిసింద్రీ, మోహన్, జైపాల్, నరసింహ తదితరులు ఉన్నారు.

నైపుణ్యాలను వెలికితీసేలా బోధన



విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలిస్తున్న ఎంఈఓ

ఉదయగిరి రూరల్: విద్యార్థుల్లో అంతర్గత సామర్థ్యాలు, నైపుణ్యాలను వెలికితీసేలా బోధన ఉండాలని ఎంఈఓ–1 టి.వెంకటేశ్వర్లు అన్నారు. ఆయన మంగళవారం పట్టణంలోని ఉర్దూ బాలికల ప్రాథమిక పాఠశాలలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులు పరిశీలించి, విద్యార్థుల సామర్థ్యాలను పరీక్షించారు. అనంతరం మాట్లాడుతూ సకాలంలో సిలబస్ పూర్తి చేసి విద్యార్థులను ఎఫ్‌ఏ–2 పరీక్షలకు సిద్ధం చేయాలన్నారు. ఎప్పటికప్పుడు విద్యార్థుల వర్క్‌బుక్‌లను పరిశీలించాలన్నారు. అనంతరం పాఠశాల జరుగుతున్న ఫ్లోరింగ్ పనులను తనిఖీ చేసి పలు సూచనలు అందించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం మహమ్మద్ కరీమ్, ఉపాధ్యాయిని నస్రీన్ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో పౌర్ణమి వేడుకలు



సంగం: యజ్ఞం నిర్వహిస్తున్న అర్చకులు

సంగం: మండలంలోని తిరమనకొండలో కొలువైన కాశీ విశ్వేశ్వరస్వామి ఆలయంలో పౌర్ణమి వేడుకలను మంగళవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి, అమ్మవార్లకు ప్రత్యేకాభిషేకాలు నిర్వహించి కుంకుమార్చన చేశారు. కాగా ఆలయంలో నిర్వహిస్తున్న లలితా రుద్ర మహాయజ్ఞం 16వ రోజుకు చేరింది. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. పీఠాధిపతి రాజరాజేశ్వరానందస్వామి పౌర్ణమి విశిష్టతను భక్తులకు వివరించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కోలగట్ల మాజీ సర్పంచ్ ఏటూరు సుధాకర్‌రెడ్డి దంపతులు, పడమటిపాళెం వైఎస్సార్‌సీపీ నాయకులు గూటూరు కృష్ణారెడ్డి, భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

• ఉదయగిరి రూరల్: మండలంలోని గండిపాళెం సిద్ధేశ్వరాలయ ప్రాంగణంలో ఉన్న పరమేశ్వరునికి భక్తులు అభిషేకాలు, పూజలు నిర్వహించారు. అనంతరం తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

వన్యప్రాణుల సంరక్షణ సామాజిక బాధ్యత



మర్రిపాడు: జెడ్పీ ఉన్నత పాఠశాలలో..

సీతారామపురం: వన్యప్రాణుల సంరక్షణ ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని ఫారెస్ట్ డీఆర్వో కేవీ ప్రసాద్ అన్నారు. ఆయన మంగళవారం స్థానిక ఆదర్శ పాఠశాలలో నిర్వహించిన వన్యప్రాణి వారోత్సవాల్లో పాల్గొని, విద్యార్థులకు వన్యప్రాణుల జీవన విధానం, సంరక్షణ చట్టాలపై అవగాహన కల్పించారు. మానవ మనుగడకు అడవులు ఎంతో అవసరమని, అటవీ జంతువులకు హాని కలిగిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ సమీరారెడ్డి, ఉపాధ్యాయ బృందం, ఎఫ్‌బీఓలు కరీముల్లా, గౌతమ్, ప్రసాద్ పాల్గొన్నారు.

• మర్రిపాడు: మండల కేంద్రంలోని జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాలలో డీఆర్వో రవీంద్రబాబు ఆధ్వర్యంలో వన్యప్రాణి వారోత్సవాలను మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వన్యప్రాణుల సంరక్షణపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. హెచ్‌ఎం పద్మలత పాల్గొన్నారు.

పొగాకు సగటు ధర రూ.138.54

మర్రిపాడు: మండలంలోని డీసీపల్లి పొగాకు బోర్డు వేలం కేంద్రంలో మంగళవారం పొగాకు సగటు ధర రూ.138.54గా నమోదైంది. వేలానికి 886 బేళ్లు రాగా 622 బేళ్లను విక్రయించామని, మిగిలిన బేళ్లను వివిధ కారణాలతో తిరస్కరించామని వేలం నిర్వహణాధికారి రాజశేఖర్ తెలిపారు. కిలోకు గరిష్ఠ ధర రూ.315 కాగా కనిష్ఠ ధర రూ.70 లభించింది. వేలంలో 10 కంపెనీలకు చెందిన వ్యాపార ప్రతినిధులు పాల్గొన్నారు.

ఘనంగా వాల్మీకి జయంతి



ఆత్మకూరు: ఎంవీఐ కార్యాలయంలో..

ఆత్మకూరురూరల్: ఆత్మకూరు మండల పరిషత్ కార్యాలయంలో వాల్మీకి మహర్షి జయంతి వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. కార్యాలయ పరిపాలనాధికారి రఘురామయ్యతో పాటు పంచాయతీరాజ్ అధికారులు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

• ఆత్మకూరు: స్థానిక రవాణా శాఖ కార్యాలయంలో ఎంవీఐ రాములు ఆధ్వర్యంలో వాల్మీకి జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

• ఉదయగిరి: పట్టణ పరిధిలోని బీజేపీ కార్యాలయంలో వాల్మీకి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి బీజేపీ నియోజకవర్గ గౌరవాధ్యక్షుడు చల్లా సుబ్బరత్నం, సుబ్బరత్నం పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ రామాయణాన్ని రచించిన మహోన్నత వ్యక్తి వాల్మీకి అన్నారు. నాయకులు రోశయ్య, చెన్నయ్య, ఖాదర్, ఖాజా నాయక్ రసూల్, వెంకటయ్య, సునీల్, నరసింహాలు తదితరులు పాల్గొన్నారు.

• స్థానిక తహసీల్దార్ కార్యాలయం, ఎంపీడీఓ కార్యాలయాల్లో వాల్మీకి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దార్ ఎల్.రామ్మోహన్, ఎంపీడీఓ కార్యాలయంలో ఏఓ పద్మజ వాల్మీకి చిత్రపటానికి నివాళులర్పించారు.

• సంగం: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో వాల్మీకి మహర్షి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి డిప్యూటీ తహసీల్దార్ జ్యోతి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

• వరికుంటపాడు: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో వాల్మీకి జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి తహసీల్దార్ హేమంత్‌కుమార్ పూలమాల వేసి నివాళులర్పించారు.